# బాబోయ్.. బతికే ఉన్నాడు

యం.ఐ.కిషన్



"నా పేరు శేషగిరిరావ్. ఇంతకుముందు ముంబైలో ఉండేవాణ్ణి. ఉద్యోగం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో డెజిగ్నేషన్ ఆడిటర్. అతికష్టమ్మీద మన ఆంధ్రాకి ట్రాన్స్‌ఫర్ చేయించుకొచ్చాను." ఎదురింట్లో కొత్తగా అద్దెకు దిగిన వ్యక్తి కలమయ్యకి షేక్‌హేండిస్తూ తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"అయామ్ కలమయ్య. నాదీ బ్యాంక్ జాబే! కెనరా బ్యాంక్‌లో క్యాషియర్ని..." కలమయ్య కూడా తనను తాను పరిచయం చేసుకున్నాడు. "రండి...వచ్చి కూర్చోండి."

శేషగిరిరావు లోపలికొచ్చి కూర్చున్నాక, కాసేపు ఆ కబురూ ఈ కబురూ అయ్యాక "మీరు టీవీలో ఫలానా ఛానెల్ చూస్తుంటారా?" అనడిగాడు కలమయ్య.

"పెద్ద ఇంట్రస్టింగా చూడను. ఎప్పుడేనా చూస్తుంటానంతే! అసలు నేను టీవీ చూసేదే తక్కువ. అదిసరే పర్టిక్యులర్‌గా ఆ ఛానల్ గురించే అడుగుతున్నారేంటి?" కుతూహలంగా అడిగాడు శేషగిరిరావు.

కలమయ్య తన నూతన మిత్రుడికేసి కాసింత గర్వంగా చూసి, ఆ తర్వాత అడిగాడు. "చెప్తే గానీ, ఆ ఛానెల్‌లో మీరు ఫలానా సీరియల్ చూస్తుంటారా?!"

"అహ " పెదవి విరిచి అడ్డంగా తలాడించాడు శేషగిరిరావు.

"ఎట్‌లీస్ట్ ఒక్కసారైనా చూడలేదా?!"

"అహ ఒక్కసారి కూడా చూళ్లేదు. ఇంతకూ ఏంటా సీరియల్ స్పెషాలిటీ?!"

కలమయ్య చిన్నగా నవ్వి చెప్పాడు. "ఆ సీరియల్‌కి రైటర్ని నేనే..."

"వాట్?!! మీరు రచయిత కూడానా? రచయితలంటే నాకు వల్లమాలిన గౌరవం." మెరుస్తున్న కళ్ళతో చూశాడు శేషగిరిరావు- నిజంగానే రచయితలంటే గౌరవమున్నవాడు కావటంవల్ల.

"ఏదోలెండి. మరీ కొమ్ములు తిరిగినవాడ్ని కాకపోయినా కాస్త విరివిగానే రాస్తుంటాను. ఎక్కువగా పత్రికలకు రాస్తుంటాను. టీవీకి రాయటం ఇదుగో ఈ సీరియల్‌తోనే ప్రారంభం" వినయం వొలికించటానికి ప్రయత్నించినా గర్వమే ఎక్కువగా జారింది కలమయ్య కంఠంలోంచి.

"మీపేరు కలమయ్య కావటం, మీరు రచయిత కావటం చాలా చక్కగా అమరింది. ఎక్కువగా మీరేం రాస్తుంటారు- కథలా, నవలలా?"

శేషగిరి చూపులోని అడ్మిరేషన్‌కి లోలోన ఉప్పొంగిపోతూ "రెండూను" అన్నాడు కలమయ్య. "మూడొందల కథలూ, ముప్పైకి పైగా నవలలూ వచ్చాయిప్పటివరకూ" అడక్కపోయినా చెప్పాడు వాటి సంఖ్యని.

"బాప్‌రే! అయితే మీరు చిన్నరచయితేం కాదన్నమాట?!" అభినందన పూర్వకంగా అన్నాడు శేషగిరిరావు. క్షణం గ్యాప్ తర్వాత ఆయనే అన్నాడు మళ్ళీ, "చాలాకాలంగా నేను మహారాష్ట్రలోనే ఉండిపోవడంవల్ల నేను మరాఠీ నేర్చుకున్నాను. సాహిత్యమంటే చిన్నప్పట్నుంచీ నాకు బాగా ఇంట్రస్టు. రాయటం అనే వరాన్ని భగవంతుడు నాకివ్వకపోయినా చదవటంలో మాత్రం నేను చాలా ఉద్ధండుణ్ణి. ఇక అదర్ వర్డ్స్- అయామే 'పుస్తకాల పురుగు'.. అందుకే మరాఠీ నేర్చుకోవడమే కాకుండా ఆ భాషాసాహిత్యాన్ని కూడా నేను క్షుణ్ణంగా చదివేశాను. తెలుగుతో పోలిస్తే మరాఠీలో రచయితలు కాస్త తక్కువే. మరాఠీలో నాకు భావోజీ పవార్ రచనలంటే చాలా ఇష్టం..."

"ఆయన చాలా పెద్దాయన కదూ?!" అడిగాడు కలమయ్య.

"మీరడిగేది పేరులోనా వయసులోనా?! అదిసరే, ఇంతకూ మీకాయన గురించి ఎలా తెలుసు?"

"ఏదో ఒక పాత మరాఠీ పత్రికలో ఆయన కథొకటి చదివాన్లెండి..."

"వాట్?! మీకూ మరాఠీ వచ్చా?!" కాస్త ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు శేషగిరిరావు.

"మరాఠీ ఒక్కటే కాదు, పంజాబీ, గుజరాతీ, కన్నడం, తమిళం, మలయాళం, కొంకణి ఇలా.. ఓ ఏడెనిమిది దాకా భాషలొచ్చు నాకు. ఎంతో కష్టపడి నా అంతట నేనే కొన్ని పుస్తకాల సాయంతో నేర్చుకున్నాను ఆయా భాషలన్నిటినీ. మాట్లాడటం అయితే రాదుగాని చదివి విషయాన్ని మాత్రం అర్థం చేసుకోగలను."

"అలాగా! అయితే మీరు బహుభాషా కోవిదులన్నమాట?" కలమయ్య మీద మరింత గౌరవం పెరగ్గా, అతనికేసి విస్ఫారిత నేత్రాలతో చూస్తూ అన్నాడు శేషగిరిరావు.

"మరీ అంత గొప్పవాణ్ణేం కాదులెండిగాని, ఏదో నా ఇంట్రస్టకొద్దీ నేర్చుకున్నానంతే. నేనిందాక చెప్పిన భానోజీపవార్‌గారి కథ దాదాపు ఓ యాభయ్యేళ్ళ క్రిందటి పత్రికలో చదివాన్నేను. సో... ఆయన ప్రస్తుతం బతికుండకపోవచ్చు. ఈజిన్టిట్?"

"భలేవారే! ఆయన బతికుండకపోవటం ఏంటి? తొంభై ఏళ్ళ వయసులో కూడా గుండ్రాయిలా ఉన్నాడు. ఆయన ఆరోగ్య రహస్యమేంటో ఆ భగవంతుడికే తెలియాలి గానీ, మొత్తానికి ఆ వయసులో కూడా ఎంతో చలాకీగా ఉంటాడాయన. ఇపుడు రాయటం మానేశారుగాని, ముంబైలో మా పక్కింట్లోనే ఉండేవారాయన. పైగా మేమిద్దరం మంచి స్నేహితులం కూడా. నాకాయన మరాఠీ నేర్పిస్తే నేనాయనకు తెలుగు నేర్పించాను. ఇపుడాయనకి తెలుగెంత బాగా వచ్చంటే, ఒక్కటి కూడా బీరుపోకుండా అన్ని తెలుగు పత్రికలూ తెప్పించుకుని చదువుకుంటారాయన."

శేషగిరిరావ్ ఉత్సాహంగా అలా చెప్పుకుపోతుంటే "అయామ్ సారీ శేషగిరిగారూ! నాక్కొంచెం అర్జంట్ పనుంది. మరోలా అనుకోకండి. మనం మళ్ళీ ఎప్పుడైనా మాట్లాడుకుందాం" అంటూ చటుక్కున లేచి నిలబడ్డాడు కలమయ్య.

"నో ప్రాబ్లం. ఎదురెదురుగానే ఉంటాంగా! కావాలంటే ప్రతిరోజూ మాట్లాడుకోవచ్చు. ముందు మీరెళ్ళి ఆ అర్జంట్ పనేదో చూసుకొని రండి" అంటూ తనూ లేచాడు శేషగిరిరావు.

• • •

"ఏంటి కలమయ్యగారూ అంత హడావుడిగా వచ్చారు?" ముఖానికి పట్టిన చెమటల్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ ఛాంబర్‌లోకి జట్‌వేగంతో దూసుకొచ్చిన ఆ రచయిత కేసి కొద్దిగా ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ఎడిటర్ గోపాలరావ్.

"చాలా అర్జంటు.." రొప్పుతూ అన్నాడు కలమయ్య.

"చెప్పండి" అతనికి కుర్చీ చూపుతూ అన్నాడు ఎడిటర్ గోపాలరావ్. అన్నట్టదొక వారపత్రికా కార్యాలయం.

"ఏం లేదుసార్! ఈమధ్య 'ఆణిముత్యం' అనే నాకథని సెలక్ట్ చేసినట్టుగా మీరు లెటర్ రాశారుగా... దాన్ని పబ్లిష్ చెయ్యొద్దు. దయచేసి నా స్క్రిప్ట్ నాకు తిరిగిచ్చేయండి..."

"దేనికీ?" ఆశ్చర్యపోతూ 'కి'కి దీర్ఘమిచ్చాడు ఎడిటర్ గోపాలరావ్. అసలే గాభరాలో ఉన్నాడేమో, "ఆ మహానుభావుడింకా బతికే ఉన్నాడట సార్. పైగా తెలుక్కూడా వచ్చట" అని పుసుక్కున నోరుజారి ఆ మీదట లటుక్కున నాలుక కరుచుకున్నాడు కలమయ్య.

ఎడిటర్‌గా పాతికేళ్ళ అనుభవమున్నా గోపాలరావ్, "ఏమహానుభావుడు?" అని అడగలేదు కలమయ్యని.

తన ఎదురుగానే ఉన్న 'సెలక్టెడ్ స్టోరీస్' ఫైల్‌లోంచి కలమయ్య రచనను వెలికితీసి అతని చేతికిచ్చేశాడు.

"థాంక్స్ సార్" అంటూ ఇంకేం మాట్లాడకుండా హడావుడిగా వెళ్ళిపోయాడు కలమయ్య.

ఆ మరుక్షణం... ఒక మంచి ఎడిటర్ ఏం చేస్తాడో అదే చేశాడు గోపాలరావ్.

అదేమిటో వేరే చెప్పాలా?

కలమయ్య పేరు 'బ్లాక్‌లిస్ట్'లో చేర్చబడింది.

★